

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సూర్యక్షేత్రం వ్యవస్థాపకుడు

# హనుమాన్ జయంతి వేడుకలకు రండి

● మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి సూర్యక్షేత్ర వ్యవస్థాపకుల ఆహ్వానం

అర్వపల్లి, మే 21 : మండలంలోని తిమ్మాపురంలో జూన్ 1న నిర్వహించే హనుమాన్ జయంతి వేడుకలకు హాజరు కావాలని కోరుతూ సూర్యాపేటలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్‌కు మంగళవారం క్షేత్ర వ్యవస్థాపకులు, సౌర ఆరాధకుడు కాకులారపు జనార్దన్‌రెడ్డి ఆహ్వాన పత్రికను అందజేశారు. జూన్ 1న హనుమాన్ జయంతి వేడుకలతో పాటు సీతారాముల కల్యాణంను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, గణపురం నరేశ్, యాదగిరి, వెంకటేశ్వర్లు, గుండ హరినాథ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

● జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కృష్ణయ్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కృష్ణయ్య

సూర్యాపేట అర్బన్, మే 21 : ఈ నెల 24 నుంచి జరుగనున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జానపాటి కృష్ణయ్య అన్నారు. మంగళవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఎస్, డీఓ, కస్టోడియన్లకు నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 21 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. పరీక్షల విధులను నిర్లక్ష్యం చేయరాదని అటువంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆర్.కుమార్, ప్రభాకర్‌రెడ్డి, సోమయ్య, యాదయ్య, సైదులు, వెంకటేశ్వర్లు, కృష్ణ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు పని కల్పించాలి: ఎంపీపీ పార్వతి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పార్వతి

మఠంపల్లి, మే 21 : మండలంలోని అన్ని గ్రామాల ఉపాధి కూలీలకు పని కల్పించాలని ఎంపీపీ ముడావత్ పార్వతీకొండానాయక్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఏపీఓతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. వేసవికాలం దృష్ట్యా ఉపాధి పనికి వచ్చే కూలీలకు మంచినీరు, శానిటేషన్ కల్పించాలన్నారు. వడదెబ్బ సోకకుండా ఉదయం త్వరగా పనులు పూర్తి చేసేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా మండలంలో జరిగిన ఉపాధి హామీ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జానకిరాములు, ఎంపీఓ ఆంజనేయులు పాల్గొన్నారు.

# నాలా ఆక్రమణ

– పొటెత్తుతున్న వరద నీరు
– రైతులు, స్థానికుల ఆందోళన



నాలా వద్ద ఆందోళన చేస్తున్న రైతులు, స్థానికులు

బొడ్రాయిబజార్, మే 21 : జిల్లా కేంద్రంలోని 16వ వార్డులో నిజాం కాలం నుంచి ఉన్న నాలాను కొందరు ఆక్రమించడంతో వరదనీరు పొటెత్తి ఇండ్లు, పంట పొలాలకు ఇబ్బందులు కలిగిస్తున్నది. దాంతో నాళాను పరిరక్షించాలని కోరుతూ కాలనీవాసులు, సమీప రైతులు మంగళవారం నాలా వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వార్డులోని నాలాను కొందరు ఆక్రమించడంతో మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారులకు ఫిర్యాదు చేయగా వారు ప్రభుత్వ సర్వేయర్‌తో వచ్చి నక్ష ప్రకారం 33 ఫీట్లు నాలా ఉన్నట్లు హద్దులు నిర్ణయించారు. ఈ మేరకు నాలాను సరి చేస్తుండగా జేసీబీ డ్రైవర్లను ఆక్రమణదారులు బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలా ఆక్రమణకు గురి కావడంతో ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ నుంచి వచ్చిన వరదనీరు దిగువకు వెళ్లే మార్గం లేక ఇండ్లు, పొలాల్లోకి పొటెత్తినట్లు చెప్పారు. అధికారులు స్పందించి ఆక్రమణకు గురైన నాలాను క్రమబద్ధీకరించి వరదనీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో మున్సిపల్, కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సలిగంటి వీరేందర్, డేగల రమేశ్, తండు లింగయ్య, ఇస్మాయిల్, సంజీవరెడ్డి, జలంధర్‌రెడ్డి, బూర రవి, హుస్సేన్, పన్నాల కృష్ణారెడ్డి, వై.మురళి, సుంకరి లింగయ్య, ఆల్దాస్ రామచంద్రయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327722-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635 |
| హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638 |
| మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777638 |



తుంగతుర్తి : మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



తిరుమలగిరి : తిరుమలగిరిలోని తాసీల్దార్ కార్యాలయంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

● బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

తిరుమలగిరి, మే 21 : ఈ నెల 27న జరిగే నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్వీ జిల్లా కో ఆర్డినేటర్ శోభన్ బాబు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లోని పట్టభద్రులను కలిసి రాకేశ్‌రెడ్డికి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు, నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలంటే ప్రశ్నించే గొంతుక రాకేశ్‌రెడ్డిని గెలిపించుకోవాల్సి అవసరం ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సతీశ్‌కుమార్, దూపటి రవీందర్, నరోత్తంరెడ్డి, బర్ల వెంకన్న, మూల వెంకట్‌రెడ్డి, యాకూబ్ నాయక్, బెడద కరుణాకర్, త్రిశూల్, వెంకన్న, కృష్ణ, జగన్, మల్లేశ్, ఉమేశ్ పాల్గొన్నారు.

**తుంగతుర్తిలో ఇంటింటి ప్రచారం**

తుంగతుర్తి : రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నరేశ్, పార్టీ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య, జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్, తునికి సాయిలు, గుడిపాటి వీరయ్య, గొపగాని శ్రీనివాస్, గోపగాని వెంకన్న, మల్లెపాక వెంకన్న, బొంకూరి మల్లేశ్ పాల్గొన్నారు.

అర్వపల్లి : రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ మండల కేంద్రంలోని తాసీల్దార్, ఎంపీడీఓ, మండల మహిళా సమాఖ్య, ఉపాధి హామీ, పీహెచ్‌సీ కార్యాలయాల్లో జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు గుండగాని సోమేశ్‌గౌడ్, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొట్టిపాక సైదులు, గ్రామ శాఖ అధ్యక్షుడు కడారి నరేశ్, కట్టెల మల్లేశ్, పులిచర్ల ప్రభు, నాగరాజు, పరమేశ్, ఎల్లప్ప, లింగస్వామి, సందీప్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నూతనకల్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన ఏనుగుల రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మున్న మల్లయ్య అన్నారు. మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ప్రతి గ్రాడ్యుయేట్ ఓటరు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జక్కి పరమేశ్, గుగులోతు నర్సింగ్‌నాయక్, చూడి లింగారెడ్డి, గుగులోతు సురేందర్‌నాయక్, బత్తుల సాయిల్‌గౌడ్, బిక్కి బుచ్చయ్య, యాదగిరి, వెంకన్న, ఏర్పుల లింగయ్య, సైదులు, లింగరాజు పాల్గొన్నారు.



అర్వపల్లి : రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ మండల కేంద్రంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



నూతనకల్ : మండల కేంద్రంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ పక్కన ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్ లత

# లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

● కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, మే 21 : పుట్టబోయేది ఆడబిడ్డా మగబిడ్డా అని పరీక్షలు చేసి చెప్పినా, ఆడబిడ్డ అని తెలిసి అబార్షన్ చేసినా, చేయించుకున్నా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు-చట్టపరమైన చర్యలపై నిర్వహించిన జిల్లాస్థాయి సమీక్ష సమావేశంను ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింగ నిర్ధారణ నేరమన్నారు. పరీక్ష చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ చట్టాలపై అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. వైద్య శాఖ అధికారులే కాకుండా డివిజన్ల వారీగా ఆర్డీఓలు వారి పరిధిలో నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయాలని చెప్పారు. జిల్లా సమాఖ్య, మండల సమాఖ్య సభ్యులకు జిల్లా గ్రామీణాభివృద్ధి, వైద్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లా విద్యాధికారులు కళాశాలలు, పాఠశాలలో ఈ చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఎస్పీ రాహుల్ హెగ్డే మాట్లాడుతూ.. ఆడబిడ్డలకు, మహిళలకు ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. లింగ నిర్ధారణ చేస్తే పడే శిక్షలు, చట్టంపై ప్రచారం చేయాలన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో ఆర్ఎంపీలకు అవగాహన కల్పించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం, ఇండియన్ రెడ్‌క్రాస్ చైర్‌పర్సన్ కోటేశ్వరి, డీఎఫ్ఓ సతీశ్‌కుమార్, ఆర్డీఓలు సూర్యనారాయణ, శ్రీనివాస్, ఈడీఓ అశోక్, డీఆర్డీఓ మధుసూధన్‌రాజు, వైద్యులు వెంకటరమణ, జయశ్యాంసుందర్, నాజియా, కళ్యాణ్‌చక్రవర్తి పాల్గొన్నారు.

**అటవీ భూములను పరిరక్షించాలి**

జిల్లాలోని అటవీ భూములను పరిరక్షించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అటవీ శాఖ, రెవెన్యూ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పరిహార అటవీ భూములపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పరిశ్రమలకు కేటాయించిన అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా అటవీ శాఖకు భూములను కేటాయించాలన్నారు. ఈ పరిహార అటవీ భూముల నోటిఫికేషన్ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపేందుకు జిల్లా అటవీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేసి నివేదికలు పంపాలన్నారు. జిల్లాలో నడిగూడెం, చింతలపాలెం మండలాల్లో కేటాయించిన భూములను నోటిఫికేషన్ కోసం ప్రతిపాదనలను కలెక్టర్ సమీక్షించి పలు సూచనలు చేశారు. సమావేశంలో డీఎఫ్ఓ సతీశ్‌కుమార్, కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాస్, సర్వే అధికారి శ్రీనివాస్‌రెడ్డి, కోదాడ ఎఫ్ఆర్ఓ లక్ష్మీపతిరావు, నడిగూడెం తాసీల్దార్ సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## దోపిడీ వ్యవస్థపై విప్లవ జీవితాన్ని కొనసాగించిన జెన్ను

● సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మధు



బొడ్రాయిబజార్ : పట్టణంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జెన్ను చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బొడ్రాయిబజార్, మే 21 : భూస్వామ్య, పెత్తందారి, పోలీస్ నిర్బంధాలను ఎదుర్కొంటూ పీడిత తాడిత ప్రజల పక్షాన పోరాటం కొనసాగించిన వ్యక్తి కామ్రేడ్ జలగం జనార్దన్ (జెన్నుసార్) అని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు అన్నారు. జనార్దన్ 3వ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక చంద్రపుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి ఎం.డేవిడ్‌కుమార్ పార్టీ జెండాను ఆవిష్కరించగా జెన్ను చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. జెన్నుసార్ ఆశయాలను, లక్ష్యాలను ముందుకు తీసుకుపోయినప్పుడే ఆయనకు మనమర్పించే నిజమైన నివాళి అన్నారు. అనంతరం జెన్ను స్మృతిలో పాటలను అరుణోదయ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయి కృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.కోటేశ్వర్‌రావు, ఖమ్మం జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్, న్యాయవాది ధర్మార్జున్, ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, నల్లగొండ జిల్లా కార్యదర్శి ఇందూరు సాగర్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.లక్ష్మయ్య, బొడ్డు శంకర్, ఇఫ్టూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

గరిడేపల్లి : సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ఉమ్మడి నల్లగొండ మాజీ కార్యదర్శి జలగం జనార్దన్ మూడో వర్ధంతిని మండలంలోని వెలిదండ గ్రామంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు పోటు లక్ష్మయ్య, పార్టీ గ్రామ కార్యదర్శి మేకల కనకారావు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కార్యక్రమంలో పార్టీ నాయకులు ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కామళ్ల శ్రీను పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వైద్యుడు మృతి

హుజూర్‌నగర్, మే 21 : రోడ్డు ప్రమాదంలో వైద్యుడు మృతి చెందిన ఘటన వేపల సింగారం గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని నరసరావుపేటకు చెందిన వైద్యుడు దామరచర్ల శ్రీకాంత్‌బాబు(38) హుజూర్‌నగర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఏడు నెలలుగా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి బైక్‌పై మేళ్లచెర్వులోని తన స్నేహితుడి పుట్టినరోజు వేడుకకు హాజరయ్యాడు. తిరిగి వస్తుండగా మార్గం మధ్యలో వేపల సింగారం గ్రామ శివారులో బర్రెను తప్పించబోయి అదుపుతప్పి కిందపడ్డాడు. దాంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ బలరాంరెడ్డి తెలిపారు.

## కుటుంబ స్పర్ధలతో వ్యక్తి ఆత్మహత్య

మోతె, మే 21 : కుటుంబ మనస్పర్ధలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఉర్లుగొండ గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని పైనంపల్లి గ్రామానికి చెందిన కంచెం కొమరయ్య (38)కు, ఆయన భార్యకు మధ్య మనస్పర్ధలు తలెత్తాయి. దాంతో ఈ నెల 15న ఆమె తమ ముగ్గురు ఆడ పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. మనస్థాపం చెందిన కొమరయ్య 19న రాత్రి సమయంలో ఉర్లుగొండ గ్రామ శివారుకు వచ్చి కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కొమరయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మేళ్లచెర్వు, మే 21 :మరమ్మతుల కారణంగా మేళ్లచెర్వు సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు విద్యుత్ ఏఈ వెంకటేశ్వర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## ప్రైవేట్ పాఠశాలల పరిశీలన

నేరేడుచర్ల, మే 21 : నేరేడుచర్ల పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలను మంగళవారం మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ, ఎంపీడీఓ శ్యాంసుందర్‌రెడ్డి, ఎంఈఓ చత్రునాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రగతి విద్యాలయం, శ్రీవాణి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలను తనిఖీ చేసి ఫీజుల వివరాలను, పాఠశాలలో గల మౌలిక వసతులు, ఆవరణను పరిశీలించారు.

## ఎస్‌వీ కళాశాలలో డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు

సూర్యాపేట అర్బన్, మే 21 : పట్టణంలోని ఎస్‌వీ కళాశాలలో డిగ్రీ ప్రవేశాలు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.వెంకటేశులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీఎస్సీ, బీకామ్ గ్రూపుల్లో ప్రవేశాలు కల్పించడంతో పాటు ఎన్‌సీసీ ఉన్న ఏకైక కళాశాల ఎస్‌వీ కళాశాల అన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 9940194909, 8106089325, 9290644821 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

## మట్టపల్లి నృసింహుడి తిరుకల్యాణ మహోత్సవం ప్రారంభం



తిరుకల్యాణోత్సవ పూజలు చేస్తున్న దేవాలయ అర్చకులు

మఠంపల్లి, మే 21 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో స్వామి వారి తిరుకల్యాణ మహోత్సవాన్ని ఆలయ అర్చకులు మంగళవారం శాస్త్రోక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారికి విశ్వక్సేన పూజ, రుత్విగ్వరణం, రక్షాబంధనం, అఖండ దీపారాధన, మృత్యంగ్రహణ, అంకురారోపణ, ధ్వజారోహణ, నవ కుంభారోపణ వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్ పాల్గొన్నారు.

**పటిష్ట బందోబస్తు**

మట్టపల్లి క్షేత్రంలో బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున జరిగే స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే కల్యాణోత్సవాలకు ప్రటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, తాసీల్దార్ మంగా రాథోడ్ తెలిపారు. క్షేత్రంలో పార్కింగ్, కల్యాణ మండపం, క్యూలైన్లు, వీఐపీల పార్కింగ్ స్థలం, బస్సు, వాహనాల రాకపోకలు తదితర వాటిపై అధికారులు పోలీసులతో సమీక్ష నిర్వహించారు. వీఐపీలకు దర్శనాలు, తాగు నీరు, నీడ, వసతి సౌకర్యాలు, తదితర మౌలిక వసతుల కల్పనకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. వారి వెంట మఠంపల్లి ఎస్ఐ ఎం.రామాంజనేయులు, ఆలయ ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

● తాసీల్దార్ జ్యోతి




మేళ్లచెర్వు ఉన్నత పాఠశాల పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తాసీల్దార్ జ్యోతి

మేళ్లచెర్వు, మే 21 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఈ నెల 27న జరుగనున్న ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తాసీల్దార్ జ్యోతి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న 1,334 మంది పట్టభద్ర ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్ఐ వాసు పాల్గొన్నారు.

# చెత్త సేకరణపై విద్యార్థిని రీసెర్చ్



ప్రాజెక్ట్ రిపోర్టును కమిషనర్‌కు అందజేస్తున్న విద్యార్థిని కావేరి

బొడ్రాయిబజార్, మే 21 : సూర్యాపేట మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న తడి, పొడి చెత్త సేకరణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై కె.ఎల్.యూనివర్సిటీ విద్యార్థినీ సారగండ్ల కావేరి పరిశోధన చేసింది. ప్రాజెక్ట్ రిపోర్టును మంగళవారం మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్‌కు అందజేసింది. ఈ సందర్భంగా కావేరి మాట్లాడుతూ.. చెత్త సేకరణపై రీసెర్చ్ చేసి ప్రస్తుతం ఉన్న టెక్నాలజీతో సస్టైనబుల్ శానిటేషన్ ఎలా సాధించాలో తన రీసెర్చ్‌లో పేర్కొన్నట్లు వివరించింది. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

## రిజర్వేషన్ల పెంపు తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

● బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర్‌యాదవ్

నూతనకల్, మే 21 : రాష్ట్రంలో కుల గణన చేపట్టి బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాస శంకర్‌యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లు 20 శాతం నుంచి 48 శాతానికి పెంచుతామన్న హామీని నెరవేర్చాలన్నారు. బీసీలో ఏ,బీ, సీ, డీ వర్గీకరణ ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తే బీసీలోని అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో మధు, బ్రాహ్మ, వీరమల్లు, శేఖర్ పాల్గొన్నారు.

## రాఘవాపురం తోటం చెరువును పరిరక్షించాలి

● కలెక్టర్‌కు రైతుల వినతి

మేళ్లచెర్వు, మే 21 : మండలంలోని హేమ్లాతండా గ్రామ పంచాయతీ పరిధిలోని రాఘవాపురం తోటం చెరువును కొందరు కబ్జా చేసి మట్టితో పూడ్చుతున్నారంటూ గ్రామానికి చెందిన పలువురు రైతులు మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. కబ్జాతో చెరువు నీటి పరిమాణం తగ్గి ఆయకట్టు రైతులు నష్టపోయే ప్రమాదం ఉన్నదని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు.

## బహిరంగంగా మద్యం సేవిస్తే చర్యలు

● ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, మే 21 : బహిరంగంగా మద్యం తాగడం, దూమపానం చేయడం వంటివి చట్టరీత్యా నేరమని ఎస్పీ రాహుల్ హెగ్డే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసాంఘీక కార్యకలాపాలపై జిల్లా వ్యాప్తంగా నిఘా ఉంచినట్లు వెల్లడించారు. ఇలాంటివి చూసి వాటికి పిల్లలు అలవాటు పడి తప్పుడు మార్గంలోకి వెళ్లే అవకాశం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ఉండాలన్నారు. మైనర్లకు మద్యం, పొగాకు ఉత్పత్తులు వంటి మత్తు పదార్థాలను అమ్మవద్దని హెచ్చరించారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **నేలకొండపల్లి బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్ట్రర్ తనఖా చేయించుకొని **నవిలె రామకోటయ్య**, S/o : **వెంకటయ్య, వయస్సు** : 44 సం॥లు, వృత్తి : వ్యాపారము, **నివాసం** : ఇ.నెం. 3-88, ఎస్.సి. కాలనీ, మామిళ్ళగూడెం, మోతె మండలం, సూర్యాపేట జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

**షెడ్యూలు ఆస్తి** : జిల్లా రిజిస్ట్రార్ నల్లగొండ, సబ్ రిజిస్ట్రార్ సూర్యాపేట వారి జ్యూరిస్‌డిక్షన్‌లోను, జిల్లా పరిషత్ సూర్యాపేట, మండల పరిషత్ మోతె, గ్రామ పంచాయితీ బోర్డు మామిళ్ళగూడెం పరిధిలోని విస్తీర్ణము 151 చ॥గ॥ సరియగు 126.25 చ॥మీ॥ స్థలములో నిర్మించిన ఇల్లు, గ్రామ పంచాయితీ రికార్డులలో ఇ.నెం. 3-27/2 (అసెస్మెంట్ నెం. 326)గల దాని కట్టుబడి విస్తీర్ణము 281 చ॥అ॥ ఏ.సి.సి. షీట్స్ పైకప్పుతో గలది. ఇంటీరియర్ రెసిడెన్షియల్ ఏరియాలో ఉండి, **డాక్యుమెంట్ నెం. 6145/2024** గల ఆస్తికి హద్దులు : **ఉత్తరము** : ఇంద్రియాల వెంకన్న గారి ఇల్లు, **దక్షిణము** : 20 అడుగుల సి.సి. రోడ్, **తూర్పు** : దోమల సుశీల గారి ఇల్లు, **పడమర** : 20 అడుగుల సి.సి. రోడ్.

**జి.హరేందర్ రెడ్డి**
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **నేలకొండపల్లి బ్రాంచ్** వారు ఇచ్చిన బొగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్ట్రర్ తనఖా చేయించుకొని **నవిలె పుష్ప**, W/o : **రామకోటయ్య, వయస్సు** : 36 సం॥లు, వృత్తి : గృహిణి, **నివాసం** : ఇ.నెం. 3-88, ఎస్.సి. కాలనీ, మామిళ్ళగూడెం, మోతె మండలం, సూర్యాపేట జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

**షెడ్యూలు ఆస్తి** : జిల్లా రిజిస్ట్రార్ నల్లగొండ, సబ్ రిజిస్ట్రార్ సూర్యాపేట వారి జ్యూరిస్‌డిక్షన్‌లోను, జిల్లా పరిషత్ సూర్యాపేట, మండల పరిషత్ మోతె, గ్రామ పంచాయితీ బోర్డు మామిళ్ళగూడెం పరిధిలోని విస్తీర్ణము 114 చ॥గ॥ సరియగు 95.32 చ॥మీ॥ స్థలములో నిర్మించిన ఇల్లు, గ్రామ పంచాయితీ రికార్డులలో ఇ.నెం. 3-105 (అసెస్మెంట్ నెం. 417)గల దాని కట్టుబడి విస్తీర్ణము 912 చ॥అ॥ ఏ.సి.సి. షీట్స్ పైకప్పుతో గలది. ఇంటీరియర్ రెసిడెన్షియల్ ఏరియాలో ఉండి, **డాక్యుమెంట్ నెం. 6144/2024** గల ఆస్తికి హద్దులు : **ఉత్తరము** : నవిలె నాగయ్య గారి ఇల్లు, **దక్షిణము** : 20 అడుగుల సి.సి. రోడ్, **తూర్పు** : 20 అడుగుల సి.సి. రోడ్, **పడమర** : నవిలె మల్లయ్య గారి ఇల్లు.

**జి.హరేందర్ రెడ్డి**
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542